


బడుల్లో బోనాల పండుగ




నిబంధనలు బేఖాతరు

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**అక్షరటుడే ఇందూరు:** జిల్లాలో వర్షాల వల్ల ఇబ్బందులు ఏర్పడితే సంప్రదించేందుకు కలెక్టరేట్ లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కంట్రోల్‌రూం నిరంతరం పనిచేస్తుందని, ఏ సమయంలోనైనా ప్రజలు 08462220183 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. వర్షాల తాకిడికి లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. నగరంలోని వర్షాలకు జలమయమయ్యే పలు లోతట్టు ప్రాంతాలను గుర్తించి అధికారులను అలర్ట్ చేశామని స్పష్టం చేశారు. జిల్లాలో పురాతన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ప్రజలు ఉండవద్దని సూచించారు.



## తెయూలో రెండు రోజుల సెమినార్

**అక్షరటుడే, ఇందల్వాయి;** తెయూ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎంపవరింగ్ ఇండియా 2047: స్ట్రాటజీస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు సెమినార్ కన్వీనర్ పున్నయ్య తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం ముఖ్య అతిథులుగా, వర్సిటీ వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ ఎం యాదగిరి అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ రేవతి కీలక ఉపన్యాసం చేస్తారని, సెమినార్‌లో వివిధ వర్సిటీల నుంచి సుమారు 140 మంది పత్ర సమర్పణ చేయనున్నారని కన్వీనర్ పేర్కొన్నారు.

## తెయూ పరీక్షల తేదీల ప్రకటన

**అక్షరటుడే, ఇందల్వాయి;** తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, ఎంఏ, ఎమ్మెస్సీ, ఎమ్మెస్ డబ్ల్యూ, ఎంకాం, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీఎల్ఐఎస్సీ(బీఎల్) ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులైన ఐఎంబీఏ, ఏపీఈ, ఐపీసీహెచ్ రెండు, ఆరో సెమిస్టర్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఎంబీఏ ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు ఈనెల 31 నుంచి ఆగస్టు 14వరకు నిర్వహించనున్నట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి సంపత్ కుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

## పోలీస్‌శాఖ ఇమేజ్ పెరిగేలా సిబ్బంది పనిచేయాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పోలీస్ శాఖ ఇమేజ్ పెంచేలా సిబ్బంది నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. ధర్పల్లి సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్ లో కేసులకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రజల భద్రతపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ పేర్కొన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ప్రతి కేసులో నాణ్యమైన, ఇన్వెస్టిగేషన్ చేయాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. సర్కిల్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను నియమించి ప్రజలతో సిబ్బంది మమేకమవ్వాలని సీపీ సూచించారు. ఆయన ఏసీపీ రాజా వెంకటరెడ్డి, ధర్పల్లి సీఐ భిక్షపతి తదితరులున్నారు.

జిల్లాలో కల్తీ దాందా జోరుగా సాగుతోంది. పాల దగ్గర నుంచి మొదలుకుని ఆహార పదార్థాల వరకు ప్రతిదానిని కల్తీ చేస్తున్నారు. డబ్బుల సంపాదనే ధ్యేయంగా కల్తీ పదార్థాలు విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని కల్తీ మాఫియా అడ్డాగా చేసుకొని దందా చేస్తున్నట్లు తెలుస్తోంది.

- అక్షరటుడే, కామారెడ్డి



# కల్తీ నూనె దందా!

- కామారెడ్డి కేంద్రంగా సాగుతున్న వైనం
- బాటిళ్లకు లేబుల్, స్టిక్కర్లు అతికించి మార్కెట్‌లో విక్రయం
- పట్టించుకోని అధికారులు

కామారెడ్డి జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి ఇక్కడ వ్యాపారాలు పెరిగాయి. పట్టణం నుంచి ఇతర రాష్ట్రాలకు రాకపోకల సౌకర్యం కూడా సులువుగా ఉంది. దీంతో కొందరు అక్రమ వ్యాపారాలకు కామారెడ్డిని అడ్డాగా మార్చుకున్నారు. పట్టణానికి సమీపంలో కల్తీ ఆయిల్ తయారు చేస్తున్నట్లు సమాచారం. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

### ఇతర జిల్లాలకు సరఫరా..

పట్టణ శివారులోని ఓ ఫ్యాక్టరీలో తయారు కల్తీ నూనె



తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. దానిని బాటిళ్లలో నింపి బ్రాండెడ్ కంపెనీల స్టిక్కర్లు, లేబుల్స్ అతికిస్తున్నారు. లీటర్ నుంచి మొదలుకుని 15 లీటర్ల డబ్బాల వరకు వివిధ కంపెనీ స్టిక్కర్లను అతికిస్తున్నారు. వీటిని దుకాణాలకు తరలించి విక్రయిస్తున్నారు. ఈ కల్తీ నూనెను ఇతర జిల్లాలకు కూడా సరఫరా చేస్తున్నారు. పక్కనే ఉన్న సిరిసిల్ల, సిద్దిపేట, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో కల్తీ నూనె విక్రయాలు చేపడుతున్నారు.

### పట్టించుకోని అధికారులు

జిల్లా కేంద్రం అడ్డాగా కల్తీ నూనె తయారు చేస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రతి నెలా అధికారులకు మామూళ్లు అందుతుండటంతోనే అటువైపు వెళ్లడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కోట్లాది రూపాయల టర్నోవర్‌తో సాగుతున్న ఈ బడా మాఫియా సామ్రాజ్యం వైపు వెళ్లాలంటే అధికారులు భయపడతారని ప్రచారం సాగుతోంది. ఒకవేళ వెళ్లినా నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటారని తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి కల్తీ మాఫియాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





## పసిడి పరుగులు..

### రూ.లక్ష మార్క్‌ను టచ్ చేసిన ధర



**అక్షరటుడే, కామారెడ్డి:** బంగారం ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. శ్రావణ మాసం పెళ్లిళ్ల సీజన్ కావడంతో చాలామంది బంగారం కొనుగోలు చేయాలని అనుకుంటారు. కానీ సామాన్యులకు అందనంత దూరంలో బంగారం ధర ఉంటుంది. మంగళవారం కామారెడ్డిలో తులం బంగారం ధర రూ. లక్ష పలికింది. సోమవారం సాయంత్రం తులం బంగారం ధర రూ.99,600 ఉండగా మంగళవారం రూ. లక్ష మార్క్‌ను టచ్ చేసింది. గత కొద్దిరోజులుగా బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఈనెల 26 నుంచి పెళ్లిళ్లకు శుభముహూర్తాలు ఉన్న వేళ.. బంగారం ధరలు పెరుగుతుండడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. పెళ్లిళ్ల సీజన్ మొదలయ్యే వరకు తగ్గుతుందని భావించిన ప్రజలకు మంగళవారం నాటి ధరలు షాక్‌కు గురిచేశాయి. రూ.లక్షతో ఆగకుండా ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని స్వర్ణకారులు చెబుతున్నారు.

## ఖరీఫ్‌కు నీటిని విడుదల చేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ఖరీఫ్ సాగుకోసం ఎస్సారెస్పీ నుంచి కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు. ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌గుప్తాతో మంగళవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. నీటిని విడుదల చేసి బాల్కొండ నియోజకవర్గ ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు. రైతుల నుంచి వస్తున్న డిమాండ్‌తో పాటు సాగు నీళ్లు ఇచ్చే బాధ్యతను ఆయన గుర్తు చేశారు. ఒక తడికి నీళ్లు ఇచ్చి, వర్షాలు పడితే ఆపేయాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో ప్రధానంగా నాలుగు డిమాండ్ల విషయమై ఆయన ఎస్ఈతో మాట్లాడారు. లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల చేయాలని కోరారు. కాకతీయ కాలువ నీటిని ఇస్తే ఉప్లూర్ వద్ద గేట్లు వేసుకుని ఆ నీటికి పంట పొలాలకు మళ్లించుకుంటారని చెప్పారు.

## రాజీవ్‌నగర్ తండాలో డెంగీ కలకలం..

- రక్తనమూనాలు సేకరించిన వైద్యశాఖ

**అక్షరటుడే, బోధన్:** మండలంలోని రాజీవ్ నగర్ తండాలో డెంగీ కలకలం సృష్టించింది. తండాలో ఓ వ్యక్తికి డెంగీ సోకగా.. వెంటనే అతడిని నిజామాబాద్ జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. రాజీవ్ నగర్ తండాలో



తండాలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

చాలామంది జ్వరాల బారిన పడ్డారు. దీంతో వైద్యసిబ్బంది అలర్ట్ అయ్యారు. వెంటనే వైద్యశిబిరం ఏర్పాటుచేసి సుమారు 50 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. వాటిని పరీక్షల నిమిత్తం పంపారు. అనంతరం తండాలోని కాలనీల్లో పరిశుభ్రతపై ఎంపీడీవో బాలగంగాధర్, మెడికల్ ఆఫీసర్ జుబేరియా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరుగుతూ దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

## పథకాల అమలులో కలెక్టర్లే కీలకం

**అక్షరటుడే, ఇందూరు:** సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అట్లూరి లక్ష్మణ్ కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ఆయా శాఖల ముఖ్య కార్యదర్శితో కలిసి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ వారంలో ఒకరోజు అధికారులు హాస్టల్‌లో బస చేయాలని ఆదేశించారు. నాణ్యమైన ఆహారం అందేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయి గౌడ్ సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.




నిజాంసాగర్ మండలంలోని నల్లవాగు మత్తడి పొంగిపొర్లుతోంది. సంగారెడ్డి జిల్లాలో వర్షా లు కురుస్తుండడంతో నల్లవాగులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో మండలంలోని నర్సింగరావు పల్లి చౌరస్తా వద్ద మత్తడి పొంగిపొర్లుతోంది. కాగా.. మత్తడిని తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. – అక్షరటుడే, నిజాంసాగర్

## త్వరలోనే ఆర్మూర్‌లో సీఎం పర్యటన

**అక్షరటుడే, ఆర్మూర్:** నియోజకవర్గంలో త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉండబోతోందని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి తెలిపారు. పట్టణంలో మంగళవారం అధికారులతో కలిసి నూతన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. స్థానిక తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వద్ద భూమిని పరిశీలించారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉండబోతుందని ఆయన పేర్కొన్నారు. తద్వారా నియోజకవర్గానికి ఎక్కువ మొత్తంలో నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో వెంచర్లు చేసే వ్యక్తులు పదిశాతం భూమిని మున్సిపాలిటీకి ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ రాజు, డిప్యూటీ తహశీల్దార్ సుజాత, బీజేపీ నాయకులు రాజు, సందన్న, మందుల బాలు, జగిర్దార్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.











## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



**అక్షరటుడే, బోధన్:** ఎడపల్లి మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ హాజరై ఈ సందర్భగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలన్నారు. తద్వారా ప్రమాదాలు జరుగకుండా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ, పాఠశాల హెచ్ఎం నరహరి, తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మ ఆలయంలో పూజలు



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని గోర్గల్ బేడీల మైసమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం సందర్భంగా వేద పండితులు సంజీవరావు ఆధ్వర్యంలో భక్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరాగా, పూజల అనంతరం, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు దుర్గారెడ్డి, అంజయ్య, మహేందర్ రెడ్డి, పండరి, శేఖర్, అనిల్, సత్యనారాయణ, వీరేశం, రమేశ్, ప్రకాశ్, గాయత్రి షుగర్స్ కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన పాఠశాల స్థల పరిశీలన



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని మల్లూరు తండా పాఠశాలను ఎంపీడీవో గంగాధర్, ఏఈవో తిరుపతిరెడ్డి మంగళవారం పరిశీలించారు. గతంలో పాఠశాలకు చెందిన స్థలాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయమై పాఠశాల హెచ్ఎం లక్ష్మాగౌడ్ ఫిర్యాదు చేయడంతో, గ్రామపెద్దల సమక్షంలో విచారణ చేపట్టారు. వెంటనే అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశించారు. వారి వెంట ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు ఉన్నారు.

## తండాను సందర్శించిన ఎస్సీ సెల్ చైర్మన్



**అక్షరటుడే, నిజాంసాగర్:** పెద్ద కొడప్గల్ మండలంలోని రామారావ్ మహారాజ్ తండా(పోచారం)ను మంగళవారం జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ సౌదాగర్ అరవింద్ సందర్శించారు. తండాలో అంగన్‌వాడీ కేంద్రం, కరెంట్ సౌకర్యం కల్పించాలని తండావాసులు ఆయనను కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు.




ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలలు అనుమతి లేకుండానే కొనసాగుతున్నాయి. అయినా విద్యాశాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడట్లేదు. పాఠశాలల యాజమాన్యాలతో కుమ్మక్కై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. అనుమతి లేని స్కూళ్లలో చేర్పించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని చెబుతున్నారు. – అక్షరటుడే, బాన్సువాడ

# ప్రైవేట్ స్కూళ్లలో నిబంధనలు బేఖాతరు

- అనుమతి లేకున్నా ప్రైవేటు పాఠశాలల నిర్వహణ
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు

బాన్సువాడ పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాలకు అనుమతి లేకపోవడంతో ఎంఈవో నాగేశ్వరరావు ఇటీవల పాఠశాలకు నోటీసులు అతికించారు. అయినప్పటికీ తరగతులు కొనసాగుతున్నట్లు ఫిర్యాదులు వెళ్లడంతో పాఠశాలను సీజ్ చేశారు. ఇంత జరిగినా.. అధికారుల ఆదేశాలు పట్టించుకోని సదరు యాజమాన్యం మళ్లీ పాఠశాలలో తరగతులు ప్రారంభించారు. విద్యార్థి సంఘాలు నాయకులు పాఠశాలకు వెళ్లి నిరసన తెలిపారు. అనుమతులు లేకుండా తరగతులు ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. విద్యాశాఖ నుంచే కాకుండా మున్సిపాలిటీ నుంచి ఎన్‌వోసీ, శానిటేషన్ పర్మిషన్ కూడా తీసుకోకపోవడం కొసమెరుపు.

### ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో పలు ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టులు విక్రయించడంతో గదిని ఎంఈవో సేవాలాల్ సీజ్ చేశారు. బాన్సువాడలోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్ గదిలో పుస్తకాలు విక్రయిస్తుండగా గదిని ఎంఈవో సీజ్ చేశారు.

### విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం..!

బాన్సువాడ పట్టణంలో ఏర్పాటు చేసిన విద్యాసంస్థ ఓ కార్పొరేట్ సంస్థకు చెందినది కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ పిల్లల్ని పెద్దసంఖ్యలో చేర్పించారు. అనంతరం ఆ అనుమతులు లేవని అధికారులు తేల్చి చెప్పడంతో తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. కార్పొరేట్ పాఠశాల కాబట్టి ఎప్పటికైనా అనుమతులు వస్తాయని పలువురు తల్లిదండ్రులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2025-2026 విద్యాసంవత్సరానికి గాను.. సదరు పాఠశాలకు పర్మిషన్ రాకపోతే వందల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశాలు ఉన్నాయి.

### విద్యాశాఖ స్పందించాలి..



జిల్లాలో పలు ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. బాన్సువాడలోని కార్పొరేట్ పాఠశాలకు పర్మిషన్ లేకున్నా తరగతులు నిర్వహిస్తున్నారు. చాలా పాఠశాలల్లో పుస్తకాలు, బెల్టు ఇతర విద్యా సామగ్రిని విక్రయిస్తున్నారు.

– బాలరాజ్, పీడీఎస్‌యూ(ఎస్) జిల్లా అధ్యక్షుడు

## విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



**అక్షరటుడే, ఆర్మూర్:** నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో మహాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బాల్కొండ ఉన్నత పాఠశాల విశ్రాంత తెలుగు పండిత్ వింజామర వెంకట నర్సయ్యను ఘనంగా సన్మానించారు. ఆయన విద్యాశాఖలో చేసిన విశేష కృషికి నిదర్శనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, డీఈవో అశోక్, డీసీసీబీ కార్యదర్శి సీతయ్య, ప్రొఫెసర్ కనకయ్య, జయంతి నిర్వహణ కమిటీ సభ్యులు కోనేరు సాయికుమార్, సిర్ప లింగం తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే లక్ష్యంగా కృషి



**అక్షరటుడే, భీమ్‌గల్:** రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కమ్మర్‌పల్లి ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. మండలంలోని మెండోరలో మంగళవారం నిర్వహించిన ఇందిరా శక్తి మహిళా సంబరాల్లో ఆయన మాట్లాడారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు, పెట్రోల్ బంక్‌ల నిర్వహణ, యూనిఫాం స్టిచింగ్, తదితర బాధ్యతలు అప్పగిస్తోందన్నారు. అంతేగాక.. మరెన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘ సభ్యులకు ప్రమాద బీమా, రుణ బీమా వర్తింపజేస్తోందని పేర్కొన్నారు. 35 శాతం సబ్సిడీతో రుణాలు అందజేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్, మండల అధ్యక్షుడు స్వామి, నాయకులు సురేందర్, నాగేంద్ర, ఐకేపీ ఏపీఎంలు రవీందర్, గంగారెడ్డి, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న 150 ఫోన్ల రికవరీ

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎవరైనా సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే ఫిర్యాదు చేయాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో రికవరీ చేసిన ఫోన్లను పలువురు బాధితులకు మంగళవారం తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ ద్వారా రూ. 25 లక్షల విలువ చేసే 150 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ చోరీకి గురైనా, పొరపాటున పోగొట్టుకున్నా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. గడిచిన వారం రోజుల్లోనే 150 ఫోన్లను రికవరీ చేశామన్నారు. మొబైల్ రికవరీ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఇప్పటి వరకు ఈ టీం సభ్యులు 627 ఫోన్లను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 3,551 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన టీం సభ్యులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.



రికవరీ చేసిన ఫోన్లతో ఎస్పీ రాజేష్ చంద్ర

గాంధారిలోని విజ్ఞాన్ స్కూల్‌లో..





కోటగిరి మండల కేంద్రంలో..




## బడుల్లో బోనాల పండుగ

జిల్లా వ్యాప్తంగా ఆషాఢ మాసం సందర్భంగా ఆయా పాఠశాలల్లో మంగళవారం బోనాల సంబురాలు నిర్వహించారు. చిన్నారులు బోనాలు ఎత్తుకుని ఉత్సాహంగా సంబురాల్లో పాల్గొన్నారు. కోటగిరిలోని శ్రీ వేద హైస్కూల్‌లో, గాంధారి మండల కేంద్రంలోని విజ్ఞాన్, విజేత హైస్కూల్‌లో సంబురాలు జరిగాయి. – అక్షరటుడే, గాంధారి, కోటగిరి

## పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



**అక్షరటుడే, బోధన్:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం పట్టణంలోని విజయ మేరీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత మొక్కలతోనే సాధ్యమన్నారు. అదేవిధంగా బోధన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏసీపీ శ్రీనివాస్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, పట్టణ సీఐ వెంకట నారాయణ, రూరల్ సీఐ విజయబాబు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కల్లడి గ్రామానికి చెందిన దూదిగాం గంగారాం, ఇసపెల్లి చిన్న బొర్రన్నకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఇటీవల వారు అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందారు. దీంతో బాధిత కుటుంబీకులకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు డేగ పోశెట్టి, నీలగిరి శ్రీనివాస్, ఆలూరు మండల యూత్ ప్రెసిడెంట్ సిరికొండ మహేశ్, హబీబ్, గంగారాం, రవి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



దాశరథి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఖిల్లా రామాలయం కమిటీ సభ్యులు



ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో..

## నిజాం అరాచకాలను ఎదిరించిన మహాకవి దాశరథి

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణలో నిజాం అరాచకాలను తన కలంతో ఎదిరించిన మహాకవి దాశరథి అని చరిత్ర పరిశోధకులు కందకుర్తి యాదవరావు అన్నారు. ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని కోటగల్లిలో గల కార్యాలయంలో దాశరథి కృష్ణమాచార్యుల జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ రోజుల్లో నిజాం దుర్మార్గపు పాలనను ప్రశ్నించారన్నారు. దాశరథి కృష్ణమాచార్యులను తొలుత వరంగల్ జైల్లో బంధించి చిత్రహింసలకు గురి చేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత నిజామాబాద్ జిల్లా జైలుకు తరలించారని, ఇక్కడి జైలు గోడల మీద బొగ్గుతో తన కవితలు రాసి సమాజాన్ని చైతన్యం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్య అధ్యక్షుడు మోహన్ దాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్, జిల్లా కార్యదర్శి డాక్టర్ మద్రిపల్లి భూపతి, రాజేష్, మిలింద్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

### ఖిల్లా రామాలయం కమిటీ ఆధ్వర్యంలో..

తెలంగాణలోని వేలమందికి స్ఫూర్తినిచ్చిన కేంద్రం ఖిల్లా జైలు అని జిల్లా జైలు సూపరింటెండెంట్ దశరథం తెలిపారు. దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి సందర్భంగా మంగళవారం ఖిల్లా రామాలయం కమిటీ ఆధ్వర్యంలో అప్పటి జైలు గదిలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ముక్కా దేవేందర్ గుప్తా, ప్రతినిధి మారయ్య గౌడ్, ఇతిహాస సంకల సమితి కార్య అధ్యక్షుడు మోహన్ దాస్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్, ఆనంద్, జిల్లా కార్యదర్శి డాక్టర్ మద్రిపల్లి భూపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయండి

**అక్షరటుడే,లింగంపేట:** మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని తహశీల్దార్ సురేష్‌కు బీజేపీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతికుమార్ మాట్లాడుతూ.. లింగంపేటలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకునేందుకు కూడా కష్టంగా మారిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దత్తురామ్, రామచందర్, సుభాష్, అల్లూరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## బోనం ఎత్తిన పోచారం..



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని మాత శిశు ఆస్పత్రిలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ బోనం ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ప్రజలు ఆయురారోగ్యాలతో పచ్చని పంటలతో కళకళలాడాలని మొక్కుకున్నట్లు తెలిపారు. సంబురాల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది, పీఎస్ఆర్ టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు అంజిరెడ్డి, ఎజాజ్, నర్సన్న తదితరులు పాల్గొన్నారు.